## ఆశ్వమేధికపర్వ కథాంశాలు

ఇందులో రెండు ఉపపర్వములున్నాయి. 1.అశ్వమేధపర్వము. 2.అనుగీతాపర్వము. అనుగీతాపర్వము చివర అధికపాఠములో ఒక ఉపపర్వము-వైష్ణవధర్మపర్వమని ఉంది. 4125 శ్లోకాలు వున్నాయి.

**అశ్వమేధపర్వము : -**

రణమృతులకు ఉదకప్రదానము చేసి బయటకు వచ్చిన ధర్మరాజు మనసు ఎంతో వ్యాకులమయి నిలువునా పడిపోతున్నాడు. ఇంతలో కృష్ణుని ప్రేరణతో భీముడాతనిని చేతులతో పొదివి పట్టుకొనినాడు. పాండవుల మనసులు చెదిరిపోయినవి. ధృతరాష్ట్రుడు కూడ ధర్మరాజును ఓదార్చుచూ ఇట్లనినాడు. ధర్మజా! నీవు శోకింపరాదు. శోకింపవలసినది నేను. గాంధారి కూడా చెప్పినది. కాని, నేను వినిపించుకొనలేదు. విదురుని మాటలు కూడ పెడచెవిని పెట్టాను. ఇట్లు జరుగునని విదురుడు ముందే చెప్పినాడు. దుర్యోధనుని దూషింపమనినాడు. ద్యూతసమయమున కూడ దుర్యోధనుని మాట వినవలదని చెప్పినాడు. దీర్ఘదర్శి అయిన విదురుని మాటలు పెడచెవిని పెట్టి పాపి అయిన దుర్యోధనుని అనుసరించాను. ఇప్పుడు దానికి తగిన ఫలము అనుభవించుచున్నాను. ఒక్కడు కూడా మిగలకుండా మొత్తం నూరుమంది పుత్త్రులను చంపుకున్నాను. ఇట్టి మూఢులబాట నీవు అనుసరింపరాదు. శోకము విడువుము. అట్లు జరగవలసిఉన్నది. అట్లే జరిగినది. అనినాడు. అంతలో కృష్ణుడు ధర్మజుని ఇట్లు ఓదార్చినాడు. ధర్మరాజా! నీవు సర్వధర్మములను భీష్ముని నుండి, వ్యాసుని నుండి విని యున్నావు. శోకమును విడువుము. చనిపోయినవారు ఏమి చేసిననూ తిరిగి రారు. వారిని చూడలేము. అని చెప్పిన కృష్ణునితో ధర్మరాజు "భీష్ముని చంపుకున్నాను. నా మనసునకు శాంతి లేదు" అని విలపించినాడు. ఇంతలో వ్యాసమహర్షి ధర్మజా! నీవు సర్వధర్మములు విన్నావు. మనమందరము ఈశ్వర నిర్దేశం వలన ఈ జన్మయెత్తాము. యజ్ఞ,తపోదానములు చేసి పాపములను తరించుచున్నాము. ఇప్పుడు నీవు అశ్వమేధము చేయవలసిన సమయము. నీ పూర్వులయిన భరతాది రాజర్షుల వలె ప్రవర్తించుము. దుర్యోధనాదులు కాని భీష్మద్రోణాదులు కాని వారి వారి కర్మఫలములను అనుభవించారు. అనగానే ధర్మరాజు అశ్వమేధయాగమొనరించుటకు తన కోశాగారమున ధనము లేదనినాడు.

అప్పుడు వ్యాసుడు ధనసంపాదనకు మార్గము చెప్పినాడు. మరుత్తుని చరిత్ర చెప్పి అతడు విప్రులకిచ్చిన ధనము విప్రులు పట్టుకొని వెళ్లలేక హిమవత్పార్శ్వమున విడిచి వెళ్లిపోయారు. ఆ ధనమును తెచ్చికొనుమని వ్యాసుడు చెప్పినాడు. ఆ సందర్భములో మరుత్తరాట్చరిత్రలో మహాదేవుని నామస్తుతి కూడా చేసినాడు. (శాంతి, అనుశాసన, అశ్వమేధ పర్వములలో దేవతాస్తుతులు ప్రత్యేకతలను సంతరించుకొనినవి).

ధర్మరాజు సత్యధర్మములు ప్రధానముగా చేసికొని రాజ్యమేలుచుండెను. ప్రజలందరు ధర్మాసక్తి కలిగి సంతుష్టులై యుండిరి. ఒకనాడు కృష్ణుడు అర్జునునితో ఇక నేను వెళ్లివత్తునని ధర్మరాజుతో చెప్పెదను అనగానే అర్జునుడు "మహాత్మా నిన్నునేను ఒకకోరిక కోరవలెనని ఉన్నాను. పూర్వము నీవు నాకు ఉపదేశించిన గీతనే మరలా ఒకసారి వినిపించవలెనని కోరుచున్నాను" అనెను. ఆ మాటలకు కృష్ణుడు అర్జునా! అప్పటి నీ స్థితియూ నాస్థితియూ వేరుగా వున్నది. అప్పటి యోగమును ఇప్పుడు మనమిరువురమూ కూడా పొందగలమా అనునది సందేహము. అయిననూ నీకోరిక తప్పక తీర్చవలసినది కనుక మరలా ఒకసారి చెప్పుటకు ప్రయత్నించెదను అని గీతను మరలా చెప్పినాడు. (ఈ గీతను అనుగీత అందురు. భగవత్ గీతను అనుసరించి చెప్పిన గీత కనుక దీనిని అనుగీత అను పేరుతో పిలుచుచున్నాము. భగవత్ గీత 18 అధ్యాయములు కాగా ఈ అనుగీత 36 అధ్యాయములు అయినది. గీతలో చెప్పినవి కొన్ని చెప్పనివి కొన్ని ఇందు చోటు చేసికొనినవి.) కాశ్యపుని ద్వారా జీవుని యొక్క ఉత్పత్తి, ధర్మకర్మలు వాని ఫలములు మున్నగు వానిని తెలిపి ఈ సంసారము నుండి తరించు ఉపాయమును చెప్పినాడు. వెనువెంటనే మోక్షప్రాప్తికి గురుశిష్య సంవాదమను కథ ఒకటి చెప్పి సులభోపాయమును సూచించినాడు. మోక్ష సాధనలో జ్ఞానము ప్రధానమనియూ ఒక బ్రాహ్మణుడు తన భార్యకు చెప్పినట్లుగా కృష్ణుడు చెప్పినాడు. దీనిని బ్రాహ్మణ గీత అని కూడా అందురు. ఆ తర్వాత యజ్ఞ విషయకమైన దశహోతృ విధానము తెల్పినాడు. ప్రాణాపానాది వాయువుల వివరణము కూడా ఇచ్చట సూచించినాడు. చతుర్హోతృవిధానము తెల్పి అంతర్యామి యొక్క ప్రాధాన్యమును సూచించినాడు. ప్రాస్తావికముగా పరశురామునిగూర్చి చెప్పి, అతడు

క్షత్రియ సంహారమొనరించెననియూ, దానిని తపస్సుచే తొలగించు కొనెననియూ అతడు తపస్సుచే సిద్ధిపొందిన మహాత్ముడు అనియూ తెల్పినాడు. అంబరీషుని గూర్చి చెప్పినాడు. అలర్కుని ధ్యానయోగమును గురించి కూడా విశదపర్చినాడు. మమకారత్యాగమును గురించి ధర్మునకు జనకునకు అయిన సంవాదమును తెల్పినాడు. స్వయముగా శ్రీ కృష్ణుడూ అర్జునునికి మోక్షధర్మోపదేశము చేసినాడు. త్రిగుణముల
స్వరూప స్వభావము వివరించినాడు. మహత్తత్వమనగానేమో తెలిపి పరమాత్మ తత్త్వమును తెలిసికొను తీరును తెల్పినాడు. అధ్యాత్మ అధిభూత అధిదైవతములను గూర్చి తెలిపి నివృత్తి మార్గమును స్పష్టపర్చినాడు. క్షేత్రజ్ఞుడు అన నేమో తెల్పి చతురాశ్రములగురించి తెల్పినాడు. ఆత్మ పరమాత్మల స్వరూపవివేచనము కావించాడు. ధర్మనిర్ణయము తెలిసికొను తీరును తెలిపినాడు. తపస్సు యొక్క ప్రభావమును జ్ఞానమహిమను తెలిపి అనుగీతను ఉపసంహరించాడు.

ఈ అనుగీతలో గీతలో చెప్పబడని విషయములు ఎన్నియో ప్రస్తావించబడెను. గీతలో సూక్ష్మముగా చెప్పిన విషయములను కొన్నిచోట్ల విస్తృతముగా చెప్పినాడు. గీతను వినిన అర్జునునకు మరలా మోహము కలిగనదేమోకాని అనుగీతను వినిన పాఠకులకు గాని, శ్రోతలకు గాని, మోహము ఎన్నడునూ కలగకుండునట్లుగా ఈ అనుగీత చెప్పబడినది.

తర్వాత కృష్ణుడు హస్తినాపురము వెళ్లి ధర్మరాజాదుల అనుమతిని పొంది ద్వారకకు బయలుదేరినాడు. మార్గమధ్యములో ఉదంకుని ఆశ్రమమునకు వెళ్లినాడు. ఉదంకుడు శ్రీ కృష్ణుని భరతవంశము నంతయునూ నాశనము చేసినాడని నిందించినాడు. కృష్ణుడు మహర్షి ప్రశ్నలన్నిటికిని సరైన సమాధానములు చెప్పి అతనిని సంతోషపెట్టినాడు. వెంటనే మహర్షి కృష్ణుని క్షమింపమని విశ్వరూపమును చూపించమని వేడుకొన్నాడు. జిజ్ఞాసువైన మహర్షికి విశ్వరూపమును చూపించినాడు కృష్ణుడు. మహర్షి కోరికప్రకారము మరుదేశములో కూడ జలము లభించునట్టుగా అతనికి వరమిచ్చాడు కృష్ణుడు. ఈ సందర్భముననే ఉదంకుని విద్యాభ్యాసమును గురించి కూడా తెల్పి అతని గురు భక్తిని ప్రకటించినాడు.

కృష్ణుడు ద్వారకకు చేరి వసుదేవునికి మహాభారత యుద్ధ

వృత్తాంతమంతయూ తెల్పినాడు. అభిమన్యుని వధను గూడా తెల్పినాడు. శోకపరీతులైన యాదవులందరునూ అభిమన్యునికి శ్రాద్ధమొనరించినారు. చివరగా కృష్ణుడు వారికి యుధిష్ఠిరుడు అశ్వమేధమును చేయుచున్నాడని తెల్పినాడు.

ఇచ్చట ధర్మరాజు హిమాలయమును చేరి ధనప్రాప్తికై శివపూజ చేసినాడు. అదేసమయమున కృష్ణుడు హస్తినాపురము చేరినాడు. ఉత్తరాగర్భము విచ్ఛిన్నమవుతున్నదని తెలిసి కుంతి ప్రార్థనను అనుసరించి మృత శిశువునకు ప్రాణము ఇచ్చినాడు. అతనికి పరీక్షిత్తు అని నామకరణము చేసినాడు.

శివపూజానంతరము వ్యాసుడు ధర్మరాజును చేరి మరుత్తుని విపుల సంపద ఉన్న
చోటును చూపాడు. ఆ సంపదనంతనూ రాజధానికి తరలించినారు. వ్యాసుని ఆజ్ఞ చేతనే యజ్ఞము ఆరంభమైనది. యజ్ఞాశ్వము వెంట అర్జునుడు బయలుదేరినాడు. నగరరక్షకు భీమసేనుని నకులుని నియమించినారు. సహదేవుని కుటుంబపాలనకు నియమించినారు. అర్జునుడు యజ్ఞాశ్వమువెంట బయలుదేరి త్రిగర్తులను, ప్రాగ్జ్యోతిష అధిపతియైన వజ్రదత్తుని పరాజితులను చేసినాడు. సైంధవులను పరాజితులను చేసినప్పుడు దుశ్శల ప్రార్థనతో వారిని కప్పము కట్టుటకు అంగీరించినాడు. బభ్రువాహనునితో తలపడి అర్జునుడు మృత్యువాతపడినాడు. ఉలూపి సంజివనీమణితో అర్జునుడు మరలా జీవితుడు అయినాడు. మగధరాజును, గాంధారదేశపు రాజును జయించి యుధిష్ఠిరునికి అర్జునుడు సందేశము పంపినాడు. ఉలూపి చిత్రాంగద బభ్రువాహనునితో అశ్వమేధయాగమునకు విచ్చేసిరి. యజ్ఞమంతయూ చక్కగా జరిగినది. చివర సక్తుప్రస్థుని మహిమకూడా తెల్పినాడు. యుధిష్ఠిరుని యజ్ఞమును అందరూ వేయినోళ్ల కొనియాడినారు. ఇచ్చటనే హింసారహితమైన యజ్ఞమును గూర్చి ధర్మము గురించియు, అగస్త్యుని యజ్ఞము గురించియు వ్యాసమహర్షి వివరించినాడు.

దీని తర్వాతనే వైష్ణవధర్మమనుపేర 21 అధ్యాయములలో ఎన్నియో విషయములు ప్రస్తావించబడినవి. వైష్ణవుడనగా విష్ణుభక్తి కల్గిన మానవుడు అనియూ, వైష్ణవత్వము సర్వవర్ణసామాన్యమనియూ ధర్మము వృద్ధిచెందుటకు పాపము నశించుటకు తగిన ఉపాయములు

తెల్పినాడు.దానములలో సాత్త్వికదానముగురించి తెల్పినాడు. జలదానము, అన్నదానము, అతిథి సత్కారము, భూదానము, తిలదానము, మొదలగు దానముల మహిమలను వివరించినాడు. కపిల గోదానమును విశిష్టముగా తెల్పినాడు. వాని ఫలితమును గూర్చి గూడా వివరించినాడు. ధర్మవిషయకమైన శుచిత్వమననేమో తెల్పినాడు. ఆపద్ధర్మములను అగ్నిహోత్ర విషయములను సైతమూ వివరించినాడు. సర్వులకు హితమొనరించు ధర్మములను గురించియు ద్వాదశి వ్రత మాహాత్మ్యమును గరించియు తెల్పినాడు. ఇవిఅన్నియూ కృష్ణుని ఉపదేశములనియూ ఈ ఉపదేశముల అనంతరము ద్వారకకు కృష్ణుడు చేరినాడని తెల్పి అశ్వమేధపర్వమును ముగించినాడు.

**ఇది ఆశ్వమేధికపర్వ కథాంశము.**